RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి: 4 సంచిక:127 | మంగళవారం
మే 12, 2026 | పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

దినపత్రిక

## బండి భగీరథ్ కేసులో సిట్



- సీపీ రితిరాజ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం
- రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విచారణ చేస్తామన్న సీపీ
- బాధితురాలికి న్యాయం జరగాలని సీఎం ఆదేశాలు
- రేవంత్ ఆదేశాలతో అలర్ట్ అయిన పోలీసులు

2లో




800 ఏళ్లనాటి శివాలయం విధ్వంసంపై 'వేద న్యూస్'లో ప్రచురితమైన ప్రత్యేక కథనం

## గుప్త నిధుల కోసమే అర్ధరాత్రి తవ్వకాలు!

### రేవంత్ రెడ్డి పాలనలో బడులు ఆగమే కాదు.. గుడుల విధ్వంసం కూడా జరుగుతోంది

- 24 అడుగుల లోతు వరకు ఎందుకు తవ్వారో సమాధానం చెప్పాలి
- పురావస్తు శాఖ ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- ఆలయాన్ని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి
- తవ్వకాల్లో బయటపడిన వస్తువులపై సమగ్ర విచారణ చేపట్టాలి
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ టెండర్లలో భారీ అవినీతి జరిగింది
- కాకతీయుల శివాలయ ధ్వంసంపై హరీశ్ రావు ఆగ్రహం
- అశోక్‌నగర్‌లో కూల్చివేతకు గురైన 800 ఏళ్ల ఆలయ సందర్శన
- స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి

2లో



ఆలయ విధ్వంసంపై మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్ రావు

## బిల్లుల వాత.. కరెంట్ కోత!

### కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ప్రజలకు తప్పని కరెంటు కష్టాలు

- కోతలు లేవంటున్న సర్కార్.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నం
- విద్యుత్ అంతరాయంతో వ్యాపారుల ఇబ్బందులు
- పంటల సాగుకూ తీవ్ర నష్టం
- ప్రభుత్వ కార్యాలయాల్లో నిలిచిపోతున్న కీలక పనులు
- ఫ్రీ కరెంట్ ఉన్నా లబ్ధిదారుల్లో 'బిల్లు' ఆందోళన
- వందల్లో రావాల్సిన బిల్లు.. వేలల్లో వస్తోందంటూ ఆవేదన
- ధర్పల్లి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ఎస్సీ వాడలో అంధకారం

2లో




# మత్తులో తెలంగాణ!

### మరో పంజాబ్‌లా మారుతోందా?

- డేంజర్ జోన్‌లో యువత భవిష్యత్తు!
- రకరకాల మత్తు పదార్థాలకు బానిసగా..
- చిన్న వయసులోనే మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలు
- మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి అఘాయిత్యాలు
- ఆర్థికంగా పతనం అవుతున్న కుటుంబాలు
- ప్రభుత్వ తీరుపై మేధావుల విమర్శలు
- ఇప్పటికైనా కళ్లు తెరవాలంటూ సూచన

2లో



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణలో మద్యం, మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకర స్థాయికి చేరుకుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు సంస్కృతికి నిలయమైన ఈ నేల, నేడు మద్యం మత్తులో చిక్కుకుని మరో పంజాబ్‌లా మారే ముప్పును ఎదుర్కొంటోంది. ఉపాధి లేని నిరుద్యోగులు, విద్యార్థులు చిన్న వయసులోనే మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. దీని ప్రభావంతో విచక్షణ కోల్పోయిన వారు అమానుష దాడులకు తెగబడుతుండటంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఛిద్రమవుతున్నాయి. దాదాపు 90 శాతం మంది ప్రజలు డేంజర్ జోన్‌లో ఉన్నారని అంచనాలు వెలువడుతున్న తరుణంలో, ఆదాయం కోసమే కాకుండా సమాజ హితం కోరి ప్రభుత్వం తక్షణమే మద్యం నియంత్రణ చర్యలు చేపట్టాలని మేధావులు డిమాండ్ చేస్తున్నారు.



## 400 కిలోల గంజాయి స్వాధీనం

### విలువ రూ.2 కోట్ల పైమాటే..

- అంతర్రాష్ట్ర గంజాయి ముఠాపై పోలీసుల దాడి
- ఏడుగురు అరెస్ట్, ఇద్దరి కోసం గాలింపు
- ఒడిశా నుంచి వివిధ రాష్ట్రాలకు తరలిస్తున్న స్మగ్లర్లు

2లో



## ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఒడిలా తీర్చిదిద్దుతాం

- నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యే లక్ష్యం
- విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతాం
- విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది
- విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

## స్పోర్ట్స్ బైక్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు

- అక్కడికక్కడే ఐదుగురు మృతి
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- అతివేగమే ప్రమాదానికి కారణం
- మహబూబ్‌నగర్‌లో విషాదం

2లో



## గుప్త నిధుల కోసమే
# అర్ధరాత్రి తవ్వకాలు!

**వేద న్యూస్, వరంగల్**

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో ధ్వంసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 800 ఏళ్ల కాకతీయుల నాటి శివాలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీశ్ రావు సోమవారం సందర్శించారు. కూల్చివేతకు గురైన ఆలయ ప్రాంగణంలో స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సందర్శన అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు, 'రేవంత్ రెడ్డి పాలనలో బడులు ఆగడమే కాదు.. గుడుల విధ్వంసం కూడా జరుగుతోంది' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకతీయ గణపతిదేవుడు నిర్మించిన 800 ఏళ్ల చారిత్రక శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగానే కూల్చేశారని ఆరోపించారు. ఆలయ రక్షణ కోసం ఉన్న మట్టి ఆనకట్టను తొలగించి గర్భగుడిని ధ్వంసం చేశారని, అర్ధరాత్రి సమయంలో 24 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరిపారని పేర్కొన్నారు. ఇది గుప్త నిధుల కోసం చేసిన తవ్వకాలేనని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం పనులు చేయాలంటే పగటి పూట చేయొచ్చు. మరి రాత్రివేళ తవ్వకాలు ఎందుకు చేశారు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పురావస్తు శాఖ జిల్లా అధికారి ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. వెంటనే కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయాన్ని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి, ఈ ప్రాంతాన్ని పురావస్తు శాఖ ఆధీనంలోకి ఇవ్వాలని కోరారు. తవ్వకాల్లో బయటపడిన వస్తువులపై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని కూడా హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 76 పాఠశాలల టెండర్లలో కోట్ల రూపాయల ప్రజాధనం దోపిడీ జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఇలాంటి అధిక శాతం ఎక్సెస్ టెండర్లు ఎప్పుడూ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ బైక్ రూపంలో
# దూసుకొచ్చిన మృత్యువు
### అక్కడికక్కడే ఐదుగురు మృతి

**వేద న్యూస్, మహబూబ్‌నగర్**

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం ఐదు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డులోని పాలకొండ జంక్షన్ వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రత స్థానికులను కలిచివేసింది. పోలీసుల వివరాల ప్రకారం, పాలకొండ కూడలి వద్ద ఒక కారు యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో అతివేగంగా వచ్చిన స్పోర్ట్స్ బైక్ ఆ కారును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు, కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. కారులోని మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించి రహదారిపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రాథమిక దర్యాప్తులో స్పోర్ట్స్ బైక్ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. రాత్రివేళల్లో వేగంగా వాహనాలు నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఘటనాస్థలంలో లభించిన ఆధారాలు, వాహనాల పరిస్థితిని పరిశీలిస్తూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతుల పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రమాద సమయంలో వాహనాల వేగం, రోడ్డు పరిస్థితులు, ఇతర సాంకేతిక అంశాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ దుర్ఘటనతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. రహదారులపై అతివేగాన్ని నియంత్రించేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా బైపాస్ రోడ్ల వద్ద ట్రాఫిక్ భద్రతా చర్యలు పెంచాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను
# అమ్మ ఒడిలా తీర్చిదిద్దుతాం
### విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్**

నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తగ్గకుండా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. కోర్ అర్బన్ ఏరియాలో రూ.1011 కోట్లతో నిర్మించనున్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల"కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను అనాథలుగా చూడబోమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో అదే రీతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను చూసుకోవడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. పాఠశాలలు దేశ భవిష్యత్తు నిర్మాణ వేదికలని, ఆ వేదికలను పునరుద్ధరించే ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యా రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని సీఎం వివరించారు. సిలబస్ మారుతోందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం పెరుగుతోందని, జాతీయ విద్యా విధానం మార్పులకు అనుగుణంగా తెలంగాణలో కూడా కొత్త విద్యా విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సమగ్ర విద్యా విధానం అమలు చేయబోతున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ బడులు పిల్లలకు అమ్మ ఒడిలా ఉండాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి భవిష్యత్తరాలపై పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే భావితరాలు తయారుకావాలని, అందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాష్ట్రంలోని 19 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని చెప్పారు. విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం వెల్లడించారు.

# మత్తులో తెలంగాణ!

- మరో పంజాబ్‌లా మారుతోందా?
- డేంజర్ జోన్‌లో యువత భవిష్యత్తు!
- రకరకాల మత్తు పదార్థాలకు బానిసగా
- చిన్న వయసులోనే మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలు
- మద్యం మత్తులో విచక్షణ కోల్పోతున్న అఘాయిత్యాలకు
- కుటుంబాల ఆర్థిక పతనం
- ప్రభుత్వ తీరుపై మేధావుల విమర్శలు
- ఇప్పటికైనా కళ్లు తెరవాలంటూ సూచన

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ సమాజం ఇప్పుడు ఒక గందరగోళ పరిస్థితిలో ఉంది. ఒకప్పుడు సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా విరాజిల్లిన ఈ నేల, నేడు మద్యం మత్తులో ఊగిసలాడుతోంది. రాష్ట్రం మద్యం వినియోగంలో ప్రమాదకర స్థాయికి చేరుకుందని, తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టకపోతే తెలంగాణ మరో పంజాబ్‌గా మారే అవకాశం ఉందని నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.



### ఛిద్రమవుతున్న కుటుంబాలు

నేటి బాలలే రేపటి పౌరులు అని మనం చెప్పుకుంటాం, కానీ ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. చదువుకున్న నిరుద్యోగులు తమ కలలు సాకారం చేసుకోలేక, బ్రాందీ షాపుల బాట పడుతున్నారు. యుక్త వయస్సు నుంచే యువత బీరు, విస్కీ వంటి మత్తు పానీయాలతో పాటు డ్రగ్స్, గంజాయి వంటి ప్రాణాంతక వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఈ మత్తు ప్రభావంతో విచక్షణ కోల్పోయి, అభం శుభం తెలియని పసికందులపై, ఆడపడుచులపై అఘాయిత్యాలకు పాల్పడుతూ మృగాల్లా ప్రవర్తిస్తున్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికి పోవడమే కాకుండా, జీవన శైలిని కోల్పోయి అగాధంలోకి నెట్టబడుతున్నాయి.

### 90 శాతం ప్రజలు డేంజర్ జోన్‌లో

మత్తు పదార్థాల వినియోగంపై నిపుణులు వెల్లడించిన గణాంకాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. తెలంగాణలోని దాదాపు 90 శాతం ప్రజలు ఏదో ఒక రకమైన మత్తు పానీయాలకు లేదా పదార్థాలకు అలవాటు పడి డేంజర్ జోన్‌లో ఉన్నారని అంచనా. గతంలో పంజాబ్ రాష్ట్రం ఇలాగే మద్యం మత్తులో మునిగి, ఆపై ప్రమాదకరమైన డ్రగ్స్ సంస్కృతిలోకి జారిపోయింది. తెలంగాణ కూడా ఇప్పుడు అదే బాటలో పయనిస్తోందని, ఇది భావితరాల మనుగడకే ముప్పు అని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ తీరుపై విమర్శలు

రాష్ట్ర ప్రభుత్వం తన ఆదాయ వనరులను పెంచుకోవడమే లక్ష్యంగా, పరిమితికి మించి బ్రాందీ షాపులను ప్రోత్సహిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుద్యోగుల కలలు బ్రాందీ షాపులకు అంకితమవుతుంటే, ప్రభుత్వం మద్యం విక్రయాల ద్వారా సొమ్ము చేసుకుంటోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం, విద్యా నైపుణ్యాలతో కూడిన విలువలను పెంచడం వంటి పనులను విస్మరించి, కేవలం మద్యంపైనే దృష్టి పెట్టడం వల్ల సమాజం అధోగతి పాలు అవుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### మార్పు రావాలి.. మనుగడ సాగాలి!

మనం కోరుకున్న తెలంగాణ ఇది కాదని, మన చేతులతో మన కంటిని పొడుచుకున్నట్టుగా ఈ మత్తు సంస్కృతి తయారైందని మేధావులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి మద్యం నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలి. యువతలో మార్పు రావాలని, వారిని విద్యావంతులుగా, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దేలా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. భావితరాలకు భరోసా ఇచ్చే దిశగా ప్రభుత్వం తన తీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కరెంట్ కోత.. బిల్లుల వాత..!




- కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ప్రజలకు తప్పని కరెంటు కష్టాలు
- కోతలు లేవంటున్న సర్కార్.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నం
- విద్యుత్ అంతరాయంతో వ్యాపారుల ఇబ్బందులు
- పంటల సాగుకూ తీవ్ర నష్టం
- ప్రభుత్వ కార్యాలయాల్లో నిలిచిపోతున్న కీలక పనులు
- ఫ్రీ కరెంట్ ఉన్నా లబ్ధిదారుల్లో 'బిల్లు' ఆందోళన
- వందల్లో రావాల్సిన బిల్లు.. వేలల్లో వస్తోందంటూ ఆవేదన
- ధర్పల్లి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ఎస్సీ వాడలో అంధకారం

**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కష్టాలు సామాన్యుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో మార్పును కోరుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టిన ప్రజలకు, ఇప్పుడు కరెంటు కోతలు కన్నీళ్లు మిగిలిస్తున్నాయి. 'కాంగ్రెస్ రావాలి.. అభివృద్ధి జరగాలి' అని ఆశించిన జనాలే, ఇప్పుడు 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంటు పోయింది' అంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. గత ప్రభుత్వ గర్వాన్ని అణచివేసి అధికారమిచ్చిన ప్రజలకు, ఇప్పుడు కరెంటు అంతరాయాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

### అంతరాయం లేదంటున్న ప్రభుత్వం..

ఒకవైపు సీఎం విద్యుత్ కోతలు లేవని, ప్రతిపక్షాలు కావాలనే బురదజల్లుతున్నాయని చెబుతున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. ముఖ్యంగా రోజువారీ ఆదాయంపై ఆధారపడే చిన్నపాటి వ్యాపారస్తులు కరెంటు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. షాపుల్లో కరెంటు లేకపోవడంతో వ్యాపారాలు సాగక, కుటుంబాలను పోషించుకోలేక రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని వారు వాపోతున్నారు. అటు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా విద్యుత్ అంతరాయం కారణంగా పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో సామాన్య జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### సాగుకు తప్పని తిప్పలు

వ్యవసాయ రంగంపై కూడా ఈ విద్యుత్ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎంతో ఆశతో వరి పంట సాగు చేసిన రైతులు, సమయానికి కరెంటు లేక నీరు అందక కన్నీళ్లు పెడుతున్నారు. పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించాలని రాష్ట్ర రైతాంగం డిమాండ్ చేస్తోంది. విద్యుత్ కష్టాలు కేవలం నగరాలకే పరిమితం కాకుండా పల్లెల్లోనూ రైతు గొంతు కోస్తున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది.

### జీరో బిల్లుల పేరుతో మోత?

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'గృహ జ్యోతి' పథకంపై గ్రామాల్లో వింత చర్చలు సాగుతున్నాయి. ఒక మీటర్ పై జీరో బిల్లు ఇస్తూనే, మరో మీటర్ పై విద్యుత్ బిల్లుల మోత మోగిస్తున్నారని ధర్పల్లి వంటి గ్రామాల్లో ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. సాధారణంగా ప్రతి నెలా 150 నుంచి 200 రూపాయల వరకు వచ్చే బిల్లు, ఇప్పుడు అకస్మాత్తుగా 500 నుంచి 1500 రూపాయల పైచిలుకు రావడం పేద ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని కూలీలు, తాము కష్టపడిన సొమ్మంతా కరెంటు బిల్లులకే సరిపోతోందని వాపోతున్నారు.

### ధర్పల్లి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ఎస్సీ వాడలో అంధకారం

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని ఎస్సీ వాడలో విద్యుత్ సమస్యలు అత్యంత దయనీయంగా మారాయి. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్య కారణంగా ఇళ్లలో ఫ్యాన్లు తిరగక, ఉక్కపోత, దోమల కాటుతో జనం రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించడానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తానని ఏఈ హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు అడిగినందుకు కక్ష సాధింపుగా, కనీస నోటీసులు ఇవ్వకుండా అధికారులు కనెక్షన్లు కట్ చేస్తున్నారని, సమస్య తీరిన తర్వాతే బకాయిలు చెల్లిస్తామని బాధితులు భీష్మించుకున్నారు. మరోవైపు, ముదిరాజ్ గల్లీ వంటి ప్రాంతాల్లో రాత్రివేళల్లో విధిస్తున్న అక్రమ కోతలు దొంగతనాలకు దారితీస్తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం బిల్లుల వసూలుపైనే శ్రద్ధ చూపిస్తూ, అదనపు వసూళ్లకు పాల్పడుతున్న ధర్పల్లి విద్యుత్ అధికారుల తీరుపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## 400 కిలోల గంజాయి స్వాధీనం
### విలువ రూ.2 కోట్ల పైమాటే..

**వేద న్యూస్, హైదరాబాద్**

మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు భారీ డ్రగ్ బస్ట్ నిర్వహించారు. ఎస్‌వోటీ కూకట్‌పల్లి, పటాన్‌చెరు పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు ఔటర్ రింగ్ రోడ్ మార్గంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అడ్డుకున్నారు. ఈ దాడిలో 400 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు రూ.2 కోట్లుగా పోలీసులు అంచనా వేశారు. దాడిలో ఒక డీసీఎం వాహనం, ఒక ఎర్టిగా కారు, ఆరు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో పాల్గొన్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన నిందితులుగా భావిస్తున్న ఏ1, ఏ2 కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. ప్రాథమిక విచారణలో ఈ ముఠా ఒడిశా నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని సేకరించి వివిధ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఔటర్ రింగ్ రోడ్ మార్గాన్ని వినియోగిస్తూ రహస్యంగా రవాణా నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## బండి భగీరథ్ కేసులో
# సిట్ ఏర్పాటు

- సీపీ రితిరాజ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం
- రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విచారణ చేస్తామన్న సీపీ
- బాధితురాలికి న్యాయం జరగాలని సీఎం ఆదేశాలు
- రేవంత్ ఆదేశాలతో అలర్ట్ అయిన పోలీసులు

**వేద న్యూస్, హైదరాబాద్**



రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు ఈ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో ఈ సిట్ పని చేయనున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి ప్రకటించారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నిజానిజాలను వెలికితీస్తామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సోమవారం స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. కేసు దర్యాప్తులో జరిగిన ఆలస్యంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బండి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ డీసీపీ రితిరాజ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో కొనసాగుతోందని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పూర్తిగా పారదర్శకంగా దర్యాప్తు నిర్వహిస్తాం అని సీపీ రమేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వీడియోలు, పోస్టులు వైరల్ అవుతుండగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. కేంద్రమంత్రి కుమారుడు కావడం వల్లే చర్యలు ఆలస్యం అవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు రంగంలోకి దిగడంతో కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

వేద న్యూస్

మంగళవారం మే 12, 2026

# బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

- యువత భవిష్యత్తు నాశనం అవుతోంది
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన న్యాయవాది కైలాస్ కుమార్ సిరస్వాల్



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ 11వ, 24వ వార్డుల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని న్యాయవాది కైలాస్ కుమార్ సిరస్వాల్ జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. కిరాణా షాపుల ముసుగులో అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, దీంతో స్థానిక యువత మద్యానికి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అప్పటి కలెక్టర్ నీతూ ప్రసాద్ అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకున్నారని, మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత మళ్లీ పరిస్థితి అదుపు తప్పిందని పేర్కొన్నారు. గాంధీ విగ్రహం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లోనే బెల్ట్ షాపులు కొనసాగుతుండటంతో విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో తెలిపారు. మద్యం మత్తులో యువత నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, తక్షణమే అక్రమ బెల్ట్ షాపులను మూసివేసి యువత భవిష్యత్తును కాపాడాలని అధికారులను కోరారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

- కేంద్ర మంత్రి కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి
- సిరిసిల్ల పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్వీ భారీ ధర్నా



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వి నాయకులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ.. ఒక మైనర్ బాలికకు సంబంధించిన వ్యవహారంలో బండి సంజయ్ కుమారుడిపై వస్తున్న ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరగాలని కోరారు. విచారణ పారదర్శకంగా సాగాలంటే బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదై 48 గంటలు గడిచినా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోక్సో కేసులో నాన్‌బెయిలబుల్ సెక్షన్లకు బదులుగా బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. అలాగే పోక్సో చట్టంలోని సెక్షన్ 8 ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బిఆర్ఎస్వి నాయకులు హెచ్చరించారు.

# దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థ సిటీ కాలేజీ

- ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతమే లక్ష్యం
- విద్యా వారోత్సవ ప్రారంభ సభలో ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ



**వేద న్యూస్, హైదరాబాద్ :**

జుల్ఫికర్ అలీ సిటీ కళాశాల దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల ప్రారంభ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగటానికి సిటీ కళాశాల పునాదిగా నిలిచిందన్నారు. తన తండ్రి సూచనతో సిటీ కళాశాలలో ప్రవేశం తీసుకున్నానని, కళాశాలతో అనేక మధుర జ్ఞాపకాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో దీర్ఘకాలిక లక్ష్యాలతో విద్యా వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యా వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎంబీఏ వంటి ఉపాధి ఆధారిత పీజీ కోర్సులను సిటీ కళాశాలలో ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డా. సి. విద్యాధర భట్, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనబోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బండి సాయి భగీరథ్ ఎక్కడ..?

- వెంటనే అరెస్ట్ చేయాలి
- చట్టం అందరికీ సమానంగా అమలు కావాలి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**వేద న్యూస్, గంగాధర :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన మైనర్ బాలిక ఫిర్యాదు కేసులో వెంటనే అరెస్ట్ చేసి బాధితురాలికి న్యాయం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం గంగాధర మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలిక ఫిర్యాదుకు సంబంధించిన సున్నితమైన కేసులో ప్రభుత్వం, పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కేసు నమోదైందని చెబుతున్నప్పటికీ భగీరథ్ ఇప్పటివరకు ఎక్కడ ఉన్నాడో వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. చట్టం సామాన్యులకు ఒకలా, అధికార పార్టీలకు మరోలా అమలవుతుందా అని ప్రశ్నించిన ఆయన, రాజకీయ ఒత్తిళ్లు, హోదాలను పక్కనపెట్టి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి అన్యాయం జరిగేలా మధ్యవర్తిత్వం చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళల భద్రత, బాలికల రక్షణపై ప్రభుత్వాలు మాటలు కాకుండా చేతల్లో చూపాలని అన్నారు. బీజేపీ "బేటీ బచావో" నినాదాన్ని నిజంగా నమ్మితే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఘనంగా బొమ్మల కట్టయ్య 5వ వర్ధంతి



**వేద న్యూస్, కరీమాబాద్ :**

భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ మాజీ సభ్యులు ప్రముఖ సామాజిక కార్యకర్త, నిరుపేదల పెన్నిధి దళిత రత్న, ప్రజారత్న బొమ్మల కట్టయ్య 5వ వర్ధంతి వేడుకలు సోమవారం కరీమాబాద్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం బీకే ఫౌండేషన్, కరీమాబాద్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బొమ్మల అంబేద్కర్ అధ్యక్షతన వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా కట్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి బుధవందనం అనంతరం 32 వ డివిజన్ మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు, అంబేద్కర్ నగర్ కాలని మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ సారంగపాణి,సమ్మయ్యలతో పాటు మాల మహానాడు జాతీయ నాయకులు మన్నే బాబురావు, అంబేద్కర్ భవన్ కమిటీ అధ్యక్షురాలు తరాల రాజమణి, డీబీఎఫ్ అధ్యక్షులు రౌతు రమేష్, అంకేశ్వరపు రామచందర్, ఎస్సీ ఎస్టీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కొంగర జగన్ ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కుమార్, పుట్ట రవీందర్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు బొమ్మల్ల కట్టయ్య నిస్వార్థంగా తన జీవితాంతం అణగారిన వర్గాల కోసం,కృషి చేసిన పనుల గురించి కొనియాడారు. మరి ముఖ్యంగా విద్య మరియు సామాజిక చైతన్యం కోసం అలుపెరగని పోరాటం చేశారని తెలిపే అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారని నెమరువేసుకున్నారు. కట్టయ్య స్ఫూర్తితో సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు పల్లం రవి,నాగపురి సంజయ్ బాబు కల్పనా మేడిది మధుసూదన్,సింగరి రాజు కుమార్,వేణు, వొగిలిశెట్టి అనిల్, బజ్జూరి వాసు,అంబేద్కర్ భవన్ మాజీ అధ్యక్షులు నీలం మల్లేశం, కడారి కుమార్, భారతీయ బౌద్ధ మహాసభ పి కృష్ణస్వామి,కిషన్, యువజన సంఘం అధ్యక్షుడు జక్కుల రాజు, ప్రధానకార్యదర్శి తరాల రవితేజ,రాజు,స్వామి ఎలుక సిద్ధార్థ,నరేష్,ఒంటెల సురేష్, రంగాలీల మైదానం వాకార్స్ అసోసియేషన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

- విద్యార్థులకు మ్యూజిక్, డాన్స్, యోగాలో శిక్షణ
- విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలి
- ఎంఈవో శంకర్



**వేద న్యూస్, పోతంగల్ :**

పోతంగల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం మండల విద్యాధికారి ఎల్. శంకర్ గ్రామ సర్పంచ్ సంధ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. శిబిరంలో మ్యూజిక్, డాన్స్, కుట్లు-అల్లికలు, యోగా, ఇతర క్రీడల్లో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఏఏపీసీ చైర్మన్ అనురాధ, మాజీ ఎంపీపీ పవన్ కుమార్, మాజీ సర్పంచ్ గంట్ల విట్టల్, రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్, గ్రామ పెద్దలు శంకర్, వార్డు సభ్యులు పంచరెడ్డి అనిల్, ధనరాజు, రాజు, వివేకానంద యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యంతో చదివితేనే జీవితంలో విజయం సాధ్యం

- శిక్షణ తరగతులను సందర్శించిన సర్పంచ్
- విద్యార్థులకు స్వీట్స్, అల్పాహారం పంపిణీ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సోమవారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జీవితంలో సక్సెస్ కావాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానికి అనుగుణంగా కష్టపడితేనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించిన సర్పంచ్, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రైడ్స్ సంస్థను అభినందించారు. అనంతరం సర్పంచ్ దంపతులు విద్యార్థులకు స్వీట్స్, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైడ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మే 12, 2026

## రైతులపై అదనపు భారం వేయడం తగదు

- కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి
- అదనపు తూకాలతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- మాజీ ఎంపీపీ చిలుక రవీందర్



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులపై అదనపు భారం మోపుతున్న తీరు బాధాకరమని తాజా మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక సంచిలో 40 కిలోల 700 గ్రాముల వడ్లు మాత్రమే ఉండాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, కొన్ని కొనుగోలు కేంద్రాల్లో 43 కిలోలు నింపితేనే ధాన్యం దించుకుంటామని రైతులను ఒత్తిడికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే పెట్టుబడులు, ప్రకృతి విపత్తులు, అప్పుల భారంతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో అదనపు తూకాలతో మరింత భారం వేయడం అన్యాయమన్నారు. కొంత మంది రైతులు 41, 42 కిలోల వరకు కూడా భరిస్తున్నప్పటికీ, మరింత బరువు వేయాలని బలవంతం చేయడం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చూడాలని కోరారు. రైతుల నుంచి బలవంతంగా అదనపు బరువు వేయించకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఇంటర్ ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరపత్రాల ఆవిష్కరణ



**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం తొలి రోజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ విద్యాబోధన కోసం ఐఎఫ్‌పీఎస్-2, ఐడీపీఎస్-2లను గ్రామ సర్పంచ్ ఉమర్ విపాల్ ప్రారంభించారు. అనంతరం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ అడ్మిషన్ల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్, వార్డు సభ్యురాలు కురాకుల మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ దాసరి కల్పనా, వేణు దంపతులు, శైలేందర్, సునీల్, వేణు, తిరుపతి, సౌజన్య, రవీంద్ర నాయక్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ తండాలో ఫీల్డ్ లెవెల్ ఇళ్ల గణన ప్రారంభం

- సెన్సస్-2027 సర్వేకు శ్రీకారం
- ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాల నమోదు



**వేద న్యూస్, కారేపల్లి :**

కారేపల్లి మండల కేంద్రంలోని భాగ్యనగర్ తండాలో సెన్సస్-2027లో భాగంగా ఫీల్డ్ లెవెల్ ఇళ్ల గణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లు భవనాలకు నంబర్లు కేటాయిస్తూ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం చరవాణిలోని హెచ్ఎల్‌ఏ యాప్ ద్వారా కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల సంఖ్యతో పాటు ఇతర సామాజిక అంశాలను నమోదు చేయనున్నారు. జూన్ 9 వరకు మొదటి దశలో ఇండ్ల గణన కొనసాగనుంది. ఈ సర్వేకు సూపర్వైజర్‌గా వాంకుడోత్ మంగీలాల్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఎన్యుమరేటర్లుగా ఆంగోత్ శంకర్, భూక్య రాందేవ్, కేళోత్ రాములు, గుగులోతు నీలా, కందకట్ల రవికుమార్ పాల్గొంటున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ వివరాలు నమోదు చేయనున్నందున ప్రజలు సరైన సమాచారం అందించి సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్ కుమార్ కోరారు. సెన్సస్ సర్వే ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు ఉపయోగపడే ఖచ్చితమైన సమాచారం సేకరించబడుతుందని ఆయన తెలిపారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**వేద న్యూస్, సూర్యాపేట :**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురం కాలనీకి చెందిన బోర్ శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మృతుని నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చిన ఆయన, వెంటనే రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 17 రద్దు చేయాలి

- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల ధర్నా
- స్థానికులకు టెండర్లలో అవకాశం కల్పించాలని డిమాండ్



**వేద న్యూస్, కరీంనగర్ :**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కొంకటి శేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 17 కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అవకాశాలు దూరమవుతున్నాయని ఆరోపించారు. తమకు రావాల్సిన టెండర్లను ఇతర రాష్ట్రాల కంపెనీలకు కేటాయిస్తూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి జీవో నెంబర్ 17ను రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు టెండర్లలో తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన విధానాల మాదిరిగా స్థానిక నాయకులు, కాంట్రాక్టర్లకు అవకాశాలు కల్పించాలని కోరారు. స్థానికులకు కాంట్రాక్టులు ఇస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్‌లలో ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, స్వేరోస్ ప్రతినిధులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అధికారుల నిర్లక్ష్యం



- 11 గంటలు దాటినా కార్యాలయానికి రాని వైనం
- గంటల తరబడి వేచిచూసిన ప్రజలు
- బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్



**వేద న్యూస్, సింగరేణి:**

ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణ పరిష్కారం చూపాల్సిన ప్రజావాణి కార్యక్రమం సింగరేణి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఉదయం నుంచే కార్యాలయానికి చేరుకున్నారు. భూ సమస్యలు, ఆదాయ ధృవపత్రాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఉపాధి హామీ తదితర సమస్యలతో ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పటికీ, కొంతమంది అధికారులు ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయానికి రాకపోవడం ప్రజల్లో అసహనానికి కారణమైంది. గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి రావడంతో ప్రజలు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కార్యక్రమంలో పాల్గొన్న ఓ అధికారి ప్రజల వినతులు వినాల్సింది పోయి ఎక్కువ సమయం మొబైల్ ఫోన్‌కే పరిమితమయ్యారని అక్కడికి వచ్చిన ప్రజలు ఆరోపించారు. ప్రజలు సమస్యలు వివరిస్తున్న సమయంలో కూడా ఫోన్‌లోనే నిమగ్నమై ఉండటంతో ఇదేనా ప్రజావాణి నిర్వహణ? అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల నిర్లక్ష్య వైఖరి ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేక భావన కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమయాన్ని గౌరవిస్తూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న సర్పంచ్



**వేద న్యూస్, గంగాధర :**

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గంగాధర గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న అన్నారు. సోమవారం గంగాధర మండల కేంద్రానికి చెందిన గొల్లపెల్లి లత-సత్తయ్య దంపతులు తెలంగాణ ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సర్పంచ్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి కొత్త బట్టలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ప్రభుత్వ సహకారంతో సామాన్య కుటుంబాలు సొంతింటిని నిర్మించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ గృహప్రవేశ కార్యక్రమానికి విచ్చేసిన సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్నకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యశ్వంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం వెంకటేశం, మంత్రి మహేందర్, జంగిలి మహేష్, గంగాధర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండి మున్సిపాలిటీలో కో-ఆప్షన్ ఎన్నిక వాయిదా

- కోరం లేక సమావేశం రద్దు



**వేద న్యూస్, చొప్పదండి :**

కరీంనగర్ జిల్లా చొప్పదండి పురపాలక సంఘంలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల కోసం సోమవారం ఉదయం నిర్వహించాల్సిన ప్రత్యేక సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో ఎన్నికల ప్రక్రియను నిలిపివేసినట్లు మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు తెలిపారు. నిబంధనల ప్రకారం అవసరమైన కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

వేద న్యూస్ మంగళవారం మే 12, 2026

# ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ



- కూలీల సమస్యలపై డీఆర్డీఓ ఆరా
- భజ్యా తండాలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**వేద న్యూస్, కారేపల్లి :**

కారేపల్లి మండల పరిధిలోని భజ్యా తండా గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) శ్రీరామ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సందర్భంగా కూలీలు తమ సమస్యలను డీఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో తమ ఫోటోలు సక్రమంగా అప్‌లోడ్ కావడం లేదని వారు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఆర్డీఓ శ్రీరామ్.. సర్వర్ సమస్యల కారణంగా కొన్నిసార్లు ఫోటోల అప్‌లోడింగ్‌లో జాప్యం జరుగుతుందని, కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. మరికొందరు కూలీలు డిమాండ్‌లో తమ పేర్లు రావడం లేదని ఫిర్యాదు చేయగా, సాంకేతిక కారణాలను ఆయన వివరించారు. ఆధార్ కార్డులు అప్‌డేట్ కాకపోవడంతో ఈ-కేవైసీ పూర్తి కావడం లేదని, అందుకే పేర్లు నమోదు కావడం లేదన్నారు. అలాగే ఆధార్ కార్డులో ఒక పేరు, ఉపాధి హామీ కార్డులో మరో పేరు ఉండటం వల్ల కూడా డిమాండ్ జనరేట్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వెంటనే ఆధార్ వివరాలు సరిచేయించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, సాంకేతిక లోపాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పొన్నూరు శ్రీనివాస్ రావు, ఏపీఓ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ధరావత్ జ్యోతి, సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు శ్రీ హనుమాన్ జయంతి

- భక్తి, బలం, ధైర్యానికి ప్రతీక ఆంజనేయుడు

**వేద న్యూస్, చొప్పదండి :**

హిందూ సంప్రదాయంలో శ్రీ హనుమంతుడు భక్తి, బలం, ధైర్యానికి ప్రతీకగా భావించబడుతాడు. శ్రీరాముడిపై అపారమైన భక్తి కలిగిన ఆంజనేయుడు, రామాయణంలో కీలక పాత్ర పోషించాడు. అంజనాదేవి, కేసరి దంపతులకు జన్మించిన హనుమంతుడు వాయుదేవుని అనుగ్రహంతో అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఆయనను ఆంజనేయుడు, వాయుపుత్రుడు, కేసరినందనుడు అని పిలుస్తారు. బాల్యంలోనే అపారమైన శక్తి కలిగిన హనుమంతుడు ఉదయిస్తున్న సూర్యుడిని పండుగా భావించి ఆకాశంలోకి ఎగిరాడని పురాణ గాథలు పేర్కొంటాయి. ఆ సమయంలో ఇంద్రుడు వజ్రాయుధంతో కొట్టడంతో ఆయన దవడకు గాయం కావడంతో "హనుమంతుడు" అనే పేరు వచ్చిందని చెబుతారు. సీతమ్మను రావణుడి చెర నుంచి కనుగొని శ్రీరాముడికి సమాచారాన్ని అందించడం, లంక దహనం చేయడం వంటి ఘనకార్యాలతో హనుమంతుడు భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాడు. ఆయనను మహాబలుడు, బుద్ధిశాలి, రామదూత, చిరంజీవిగా భక్తులు ఆరాధిస్తారు. హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# పశువుల అక్రమ రవాణాపై నిఘా

- కోర్లపాడ్ టోల్ ప్లాజా చెక్‌పోస్ట్ తనిఖీ
- పాల్గొన్న జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్
- అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**వేద న్యూస్, నల్లగొండ :**

రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో పశువుల అక్రమ రవాణా జరగకుండా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఇందులో భాగంగా కోర్లపాడ్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా కంటైనర్ లారీలు, లోడ్ వాహనాలు, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, పశువుల రవాణాకు అవసరమైన అనుమతులు, డ్రైవర్ల వివరాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎస్పీ, రవాణా సమయంలో పశువుల పట్ల క్రూరత్వం ప్రదర్శించినా సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. పశువులను రవాణా చేసే వ్యక్తులు తప్పనిసరిగా అనుమతి పత్రాలు, కొనుగోలు రసీదులు, వెటర్నరీ ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి పశువులను ఎక్కించరాదని, తాగునీరు, ఆహారం అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వాహనాలను అడ్డుకోవడం, గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనుమానాస్పద సంఘటనలు గమనించినా డయల్ -100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, నకిరేకల్ సీఐ హరిబాబు, కేతపల్లి ఎస్ఐ సతీష్, శాలిగౌరారం ఎస్ఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అరుదైన సన్మానం

- 559 మార్కులతో మెరిసిన నారక్కపేట హైస్కూల్ విద్యార్థిని మనశ్విని




**వేద న్యూస్, నల్లబెల్లి :**

పదో తరగతిలో 550కు పైగా మార్కులు సాధించిన 103 మంది విద్యార్థులను సన్మానించే కార్యక్రమం ఆకుటోట్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య విశిష్ట అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ సత్య శారద అధ్యక్షత వహించగా, ఛైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, డీఈఓ రంగయ్య నాయుడు పాల్గొన్నారు. నల్లబెల్లి మండలం నారక్కపేట హైస్కూల్‌కు చెందిన కందకట్ల మనశ్విని 559 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శాలువా, మెడల్, ప్రత్యేక బహుమతితో ఘనంగా సత్కరించారు. అతిథులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమాలు, ప్రత్యేక తరగతులు, స్నాక్స్ పంపిణీ, ఉపాధ్యాయుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జీహెచ్‌ఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రావు, నల్లబెల్లి ఎంఈఓ అనురాధ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



- 40 ఏళ్లుగా రాజీలేని పోరాటం కొనసాగుతోంది
- బిషప్ విజయపాల్ రెడ్డి

**వేద న్యూస్, కాజీపేట :**

దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కుల సాధన కోసం కాజీపేట ఫాతిమానగర్‌లోని వైష్ణవి బ్యాంకెట్ హాలులో ఫాదర్ నవీన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ మేత్రాసనం బిషప్ విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలన్న డిమాండ్‌పై రోమన్ క్యాథలిక్ సంఘం గత 40 ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఇది దళిత క్రైస్తవుల ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 10వ తేదీని నిరసన దినంగా నిర్వహిస్తున్నామని, సమస్య పరిష్కారమయ్యే వరకు రోమన్ క్యాథలిక్ సంస్థానం అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అయూబ్ మాట్లాడుతూ.. ఈ న్యాయమైన డిమాండ్‌కు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని, పార్టీ అగ్ర నాయకత్వంతో చర్చించి మద్దతు లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. ఈ ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు రాజమౌళి, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నున్నా అప్పారావు మాట్లాడుతూ.. దేశంలో మతం మారినంత మాత్రాన కుల వివక్ష పోదని, కులం ఉన్నంత కాలం ఎస్సీ హోదా కొనసాగాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల సమస్యను మతపరమైన కోణంలో కాకుండా సామాజిక వివక్ష కోణంలో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేవ అశోక్ పాల్, బోడ డిన్న, ఫాదర్ జోసెఫ్, రాజమోహన్, పొలిమేర సృజన్ కుమార్, ప్రవీణ్, ఎన్. కిరణ్, జన్ను ఇర్మియా, అరుణ్ జేమ్స్, కొడవటి రవి తదితర నాయకులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో తిరుపతమ్మ గోపయ్య ఉత్సవాలు

- ఐదు రోజులపాటు వైభవంగా పూజలు
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్



**వేద న్యూస్, నల్లగొండ :**

వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో తిరుపతమ్మ గోపయ్య స్వామి ఉత్సవాలు ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామ వేద పండితులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. మొదటి రోజు గణపతి పూజ, కంకణ పూజ, మంగళ తోరణాల ఏర్పాటు, స్వామివారి విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. రెండో రోజు గోపూజ, హోమాలు, జలబిందులతో ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. మూడో రోజు విగ్రహ ప్రతిష్ట, అన్నదాన కార్యక్రమం, నాలుగో రోజు స్వామివారి కళ్యాణం, శోభాయాత్ర, ఐదో రోజు బోనాల సమర్పణ జరగనుంది. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణకర్త ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్ తిరుపతమ్మ గోపయ్య స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై డి. వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు.

# పాఠశాలలో వంటగది నిర్మాణానికి భూమిపూజ

- రూ.4 లక్షల నిధులతో షెడ్డు నిర్మాణం



**వేద న్యూస్, రామడుగు :**

దశాబ్దకాలంగా వంటగది లేక ఆరుబయటే విద్యార్థులకు భోజనాలు సిద్ధం చేస్తున్న రామడుగు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎట్టకేలకు వంటగది షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.4 లక్షల నిధులతో చేపట్టనున్న వంటగది నిర్మాణ పనులకు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి, ఇంటర్‌లో ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ రాజేశ్వరి, మండల విద్యాధికారి రంగనాథ శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ ఆడేపు మనోజ్, సర్పంచ్‌లు మోయిజ్, అంజన్ కుమార్, గుమ్మడి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు జవ్వాజి హరీష్, కొల రమేష్, పంజాల శ్రీనివాస్, మీడియా కోఆర్డినేటర్ అజేయ్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్
మంగళవారం మే 12, 2026

## శ్వేతార్కలో ఘనంగా హనుమాన్ జయంతి



**వేద న్యూస్, కాజీపేట :**

సపరివార సమేత స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్యక్షేత్రంలో సోమవారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవాలయ పరిపాలక నిర్వాహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో శ్రీ యోగ ఆంజనేయ స్వామివారికి పంచామృత, పంచవర్ణ సహస్రధార, ఏకధార అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వడమాల పూజ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. తీర్థప్రసాద పంపిణీతో పాటు అన్నపూర్ణ భవన్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు శీనమ్మ, మహేశ్వరి, యోగ ఆంజనేయ స్వామి దేవాలయ ఇంచార్జ్ అరుణ్ రెడ్డి, వెంకట సాయి తేజ, పద్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ముష్టిపల్లిలో భూకబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- ప్రభుత్వ భూమి ఆక్రమించి వెంచర్ వేశారని ఆరోపణ
- నిబంధనలు లేకుండానే ప్లాట్ల విక్రయాలు
- సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని విజ్ఞప్తి
- ప్రభుత్వ భూమిని కాపాడాలని వేడుకోలు

**వేద న్యూస్, సిరిసిల్ల :**

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని ముష్టిపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఆరోపిస్తూ రాజీవ్ నగర్‌కు చెందిన కైలాస్ కుమార్ సిరస్వాల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ముష్టిపల్లి సర్వే నంబర్ 106లోని 12.05 గుంటల పట్టా భూమిని ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 51లోని సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది అక్రమంగా ఆక్రమించారని తెలిపారు. గతంలో గ్రామపంచాయతీ పెద్దలు, కొంతమంది అధికారుల సహకారంతో ఎటువంటి అనుమతులు, లేఅవుట్ ప్లాన్ లేకుండానే ప్రభుత్వ భూమిలో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ భూమిని దుర్వినియోగం చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వానికి నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సర్వే నంబర్లలో వెంటనే సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని రక్షించాలని, ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## విద్యార్థుల ప్రతిభ వికాసానికి సమ్మర్ క్యాంప్

- ప్రారంభించిన సర్పంచ్ మేదరి టోనీ



**వేద న్యూస్, కారేపల్లి :**

సింగరేణి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 15 రోజుల సమ్మర్ క్యాంప్‌ను స్థానిక సర్పంచ్ మేదరి టోనీ ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే లక్ష్యంతో ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ.. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. విద్యతో పాటు ఆటలు, పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్యాంప్‌లో ఆటలు, డాన్స్, పాటలు, వ్యక్తిత్వ వికాస శిక్షణలను నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు బోధించనున్నట్లు తెలిపారు. మండలంలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల విద్యాధికారి జయరాజ్ దుగ్గిరాల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యుడు రావుల రాజశేఖర్, ప్రిన్సిపల్ ప్రేమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాలుగో రోజు ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని భాజా భజంత్రీల నడుమ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గుండూరి విట్టల్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, రాజా గౌడ్, నారా గౌడ్, రమణ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సతీష్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ఐకేపీ కేంద్రాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- రైతులకు గన్ని బ్యాగులు, లారీలు అందుబాటులో ఉంచాలని డిమాండ్



**వేద న్యూస్, సూర్యాపేట :**

ఐకేపీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతాంగానికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఐకెపి కేంద్రాలు ప్రారంభమై 50 రోజులు గడిచినా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోందని ఆరోపించారు. రైతులకు గన్ని బ్యాగుల కొరత తీవ్రంగా ఉందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో క్వింటాకు 3 నుంచి 5 కిలోల వరకు కోత విధించడం అన్యాయమన్నారు. లారీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. మొక్కజొన్న రైతులకు కూడా మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్వి నందలాల్ పవార్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా నాయకులు ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, కందాల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ ఆలమ్నీ భవన నిర్మాణానికి అనుమతి

- మంజూరు పత్రాలు అందుకున్న ఓఎస్ఏ అధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్ రావు



**వేద న్యూస్, వరంగల్ :**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం సోమవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అలుమ్ని భవన నిర్మాణం కోసం కళాశాల ఆవరణలో 4.6 గుంటల స్థలాన్ని సాంకేతిక విద్యాశాఖ అనుమతితో కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీనివాస్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్ రావుకు అధికారికంగా అందజేశారు. స్థలం కేటాయింపుపై సంఘ సభ్యులు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు సాంకేతిక విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో భూమిపూజ నిర్వహించి భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం ఈసెట్-ఆంధ్రప్రదేశ్ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, కోశాధికారి ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, సహాయ కార్యదర్శులు మహేందర్, వసంత్ కుమార్, టీఎన్ స్వామి, ప్రకాశ్, మధుసూధన్ రావు తదితరులు పాల్గొన్నారు.కుమార్, కోశాధికారి ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, సహాయ కార్యదర్శులు మహేందర్, వసంత్ కుమార్, టీఎన్ స్వామి, ప్రకాశ్, మధుసూధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో బెల్ట్‌షాపుల నిర్వాహకుల బైండోవర్

- అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల కఠిన చర్యలు



**వేద న్యూస్, ముస్తాబాద్ :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం ముగ్గురు బెల్ట్‌షాపు నిర్వాహకులను ముస్తాబాద్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సిహెచ్ గణేష్ తెలిపారు. బైండోవర్ అయిన వారిలో చీకోడు గ్రామానికి చెందిన గున్నాల రమేష్ గౌడ్, నామాపూర్ గ్రామానికి చెందిన జలిగం రాజయ్య, యారపు రామస్వామి ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలతో పాటు బైండోవర్ కూడా చేస్తామని స్పష్టం చేశారు. అక్రమ మద్యం విక్రయాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## అంగరంగ వైభవంగా గ్రామదేవతల ప్రతిష్ఠ

- అన్నదానం ప్రారంభించిన అజ్మీర వీరన్న



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామపంచాయతీ బిక్య తండాలో సోమవారం రామాలయం ధ్వజస్తంభం, గ్రామదేవతల ప్రతిష్ట ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు అజ్మీర బిచ్చ నాయక్, వాంకుడోత్ రాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో ఉదయం నుంచి గణపతి పూజ, చండీ రుద్రహోమాలు, మహాలక్ష్మీ హోమాలు, సహస్ర కుంకుమార్చనతో పాటు జలాధివాస, క్షీరాధివాస, ధాన్యాధివాస, పుష్పాధివాస కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు బి. వాసుదేవ శర్మ, బి. భరద్వాజ శర్మ, ఎన్. నాగేంద్ర శర్మ, రోహిత్ శర్మలతో పాటు పలువురు పూజారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ట అనంతరం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిశాయి. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మండల మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న ప్రారంభించారు.

## భారీ చోరీ.. 30 తులాల బంగారం, 5 లక్షల నగదు అపహరణ

**వేద న్యూస్ హైదరాబాద్ :**



హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. జైన్ స్కూల్ సమీపంలో తాళం వేసిన ఓ ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు.బాధిత కుటుంబం ఆదివారం ఉదయం పెళ్లికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గుర్తించాడు. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి తనిఖీ చేయగా సుమారు 30 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. వెంటనే బాధితుడు గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దొంగల కోసం గాలింపు చేపట్టారు.

వేద న్యూస్

మంగళవారం మే 12, 2026

# రేకుర్తి, విద్యానగర్‌లో '22ఏ' శాపం!

- నిషేధిత జాబితాలో పట్టా భూములు..
- అనిశ్చితిలో 650 ఎకరాలు
- ఏడాదిగా నిలిచిన రిజిస్ట్రేషన్లు..
- ఆస్తుల బదిలీలు ఆగిపోవడంతో ఆవేదనలో వేల కుటుంబాలు
- మానవతా దృక్పథంతో స్పందించాలని కలెక్టర్‌కు బాధితుల వినతి



**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ నగర పరిధిలోని రేకుర్తి, విద్యానగర్ ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్లపై విధించిన ఆంక్షలు వేలాది కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పట్టా భూములను 22ఏ(1)(డి) సీలింగ్ చట్టం కింద నిషేధిత జాబితాలో చేర్చడంతో గత ఏడాది కాలంగా క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బాధితులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ఆశ్రయించి తమ సమస్యలను వివరించారు. రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో ఆస్తుల బదిలీలు జరగకపోవడం, బ్యాంకు రుణాలు అందకపోవడం వల్ల సుమారు 30 వేల మంది ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతాల్లోని భూములను అకస్మాత్తుగా నిషేధిత జాబితాలో చేర్చారని బాధితులు ఆరోపించారు. రేకుర్తిలో 125 సర్వే నంబర్లలో సుమారు 536 ఎకరాలు, విద్యానగర్‌లో 16 సర్వే నంబర్లలో 115 ఎకరాల భూమిపై ఆంక్షలు విధించారని పేర్కొన్నారు. మొత్తం 650 ఎకరాల్లో సుమారు 6 వేల ఇళ్లు, 10 వేలకుపైగా ప్లాట్లు ప్రభావితమయ్యాయని తెలిపారు. గత 40 ఏళ్లుగా గ్రామ పంచాయతీ, మున్సిపల్ అనుమతులతో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నామని, ప్రభుత్వం రోడ్లు, మిషన్ భగీరథ, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించడమే కాకుండా పన్నులు కూడా వసూలు చేస్తోందని గుర్తు చేశారు. ఇంతకాలం పట్టా భూములుగా ఉన్న వాటిని ఇప్పుడు సీలింగ్ భూములుగా ప్రకటించడం అన్యాయమని వాపోయారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం ప్లాట్లు అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్లు కావడం లేదు.. బ్యాంకులో రుణాలు కూడా రావడం లేదంటూ బాధితులు కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని, మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మదర్స్ డే సందర్భంగా సేవా సంస్థకు సన్మానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

మదర్స్ డే సందర్భంగా వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 సంవత్సరాల క్రితం స్థాపించబడిన "అక్క ఆశ్రమం"లో వృద్ధులు, వితంతువులు, నిరుపేదలకు భజన కార్యక్రమాలు, అన్నదానం, సామూహిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆశ్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం సమాజంలో వృద్ధ మహిళలు, వితంతువులు మానసిక ఆవేదనకు గురవుతున్న సమయంలో వారిని చేరదీసి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సంతోషకరమైన వాతావరణం కల్పించడం అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఇలాంటి ఆశ్రమాలకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్, ఆర్గనైజర్ శ్రవణ్, నల్ల



సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ క్రాంతి కుమార్, శంకర్రావు, స్వరాజ్యలక్ష్మి, రాజేశ్వరి, గందె నవీన్, తాటిపల్లి సరస్వతి, తోట మంజుల, గీతావాణి, నాగమణి, భవాని, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్2027 విజయవంతం చేయాలి



**వేద న్యూస్ గద్వాల :**

సెన్సస్2027 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెన్సస్ కార్యక్రమంలో సంబంధిత ఛార్జ్ అధికారులు బ్లాక్ వారీగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పీఎండీడీకేవై పథకం అమలుపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 12న ఉన్నతాధికారులు గద్వాలకు వచ్చి పథకం అమలుపై చర్చించడంతో పాటు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖలు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియల్లో నిర్లక్ష్యం లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. విద్యా వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కూడా కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని తెలిపారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దు

**వేద న్యూస్ కామారెడ్డి :**



ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధు మోహన్, నర్సింగరావుతో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు భూ సమస్యలు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ వారం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 69 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

# దుర్గామాత, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠాపన

- ఈ నెల 12, 13 తేదీల్లో మహోత్సవాలు

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని గూడూరు రోడ్డుకు ఆనుకుని జర్నలిస్టుల కాలనీ వెనుక ప్రాంతంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో దుర్గామాత, పోతరాజు విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్నట్లు దేవాలయ నిర్మాణ దాతలు వెంగళ సహదేవ్ కుటుంబ సభ్యులు తెలిపారు. తమ తండ్రి కీ.శే. వెంగళ వీరయ్య జ్ఞాపకార్థం ఈ దేవాలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఉన్న దుర్గామాత ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వెంగళ వీరయ్య కుమారులు నరహరి, వెంకటస్వామి, ఆంజనేయులు, నాగరాజు, సహదేవ్ అన్నదమ్ములు తమ సొంత నిధులతో దేవాలయ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. గ్రామ ప్రజలు, కుల సంఘాల పెద్దలు, అధికారులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవాలయ నిర్మాణ దాతలు కోరారు.

# సీతారామచంద్ర స్వామి దేవాలయ భూముల సర్వే

- అన్యాక్రాంతమైన 1 ఎకరం 30 గుంటల భూమి వెలికితీత




**వేద న్యూస్, మరిపెడ :**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండేపూడి గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి చెందిన భూములను సోమవారం సర్వే చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్లు 348, 374, 375, 376, 379ల పరిధిలో ఉన్న 8 ఎకరాలు 13 గుంటల దేవాలయ భూమిని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అన్యాక్రాంతానికి గురైన 1 ఎకరం 30 గుంటల భూమిని గుర్తించి తిరిగి హద్దులు ఏర్పాటు చేశారు. దేవాలయ భూముల హద్దులను ఎవరైనా తొలగిస్తే దేవాదాయ శాఖ చట్టం 30/87 ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఎస్ఐ గండ్రాతి సతీష్, దేవాదాయ శాఖ పరిశీలకురాలు నందనం కవిత, సర్వేయర్ పి. అనిల్, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, దేవాలయ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, ఎన్‌డబ్ల్యూ కాలు, ఆర్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

- పంట వ్యర్థాలు తగులబెట్టొద్దు
- రైతులకు శాయంపేట పోలీసుల సూచనలు



**వేద న్యూస్, శాయంపేట:**

ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని శాయంపేట ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ సూచించారు. పంట వ్యర్థాలు, గడ్డి తదితరాలను కాల్చివేయొద్దని రైతులకు సూచించారు. అలాగే రహదారులపై ధాన్యం ఆరబోసడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా రోడ్లపై ధాన్యం ఆరబోసినా, పంట వ్యర్థాలను తగులబెట్టినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.

# హసన్‌పర్తి నూతన ఎస్‌హెచ్‌ఓగా ఏ.మహేందర్ బాధ్యతల స్వీకరణ

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన తాజా బదిలీల నేపథ్యంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా ఏ.మహేందర్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం వరంగల్ పీసీఆర్‌లో విధులు నిర్వర్తించిన ఆయనను హసన్ పర్తికి బదిలీ చేస్తూ పోలీస్ కమీషనరేట్ ఉత్తర్వులు జారీ చేయడంతో మహేందర్ విధుల్లో చేరారు.

వేద న్యూస్

మంగళవారం మే 12, 2026

# ‘కల్కి 2’పై భారీ అంచనాలు



వేద న్యూస్ డెస్క్:

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన ‘కల్కి 2898 ఏడీ’ భారతీయ సినీ పరిశ్రమను ప్రపంచ స్థాయిలో మరో మెట్టెక్కించిన సంగతి తెలిసిందే. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ భారీ చిత్రం ఇప్పుడు రెండో భాగంతో మరింత పెద్ద స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. మొదటి భాగం ముగింపులో వచ్చిన మలుపులు, ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఎలివేషన్స్, కమల్ హాసన్ ఎంట్రీ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ‘కల్కి 2’పైనే నిలిచింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 డిసెంబర్ నాటికి విడుదల చేయాలని చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారీ స్థాయిలో ఉండే దృశ్య ప్రభావాలు, కంప్యూటర్ గ్రాఫిక్స్ పనుల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో భారతీయ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి అందించాలనే లక్ష్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన కొంత భాగం పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం ‘స్పిరిట్’, ‘ఫౌజీ’ వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రారంభంలో ‘కల్కి 2’ కీలక షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశముందని సమాచారం.మేకర్స్ ప్రణాళిక ప్రకారం 2027 ఏప్రిల్ నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలలను పూర్తిగా నిర్మాణానంతర పనులకే కేటాయించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కర్ణ పాత్రలకు మరింత ప్రాధాన్యం ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ప్రభాస్, కమల్ హాసన్ మధ్య సాగే పవర్‌ఫుల్ పోరాట సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. మొదటి భాగం కేవలం కథకు పరిచయం మాత్రమేనని, అసలు యుద్ధం రెండో భాగంలోనే ప్రారంభమవుతుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో ‘కల్కి 2’పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లే జరిగితే 2027 డిసెంబర్‌లో ‘కల్కి 2’ ప్రపంచవ్యాప్తంగా భారీ సంచలనం సృష్టించడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# రామ్‌పై వైష్ణవి క్రష్.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వ్యాఖ్యలు

వేద న్యూస్ డెస్క్:

‘బేబి’ సినిమాతో టాలీవుడ్‌లో సంచలన విజయాన్ని అందుకుని ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి వైష్ణవి చైతన్య తాజాగా చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. టాలీవుడ్ ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేనిపై తనకున్న అభిమానాన్ని ఆమె బహిరంగంగా వ్యక్తం చేయడంతో అభిమానుల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన వైష్ణవి చైతన్య, చిన్నప్పటి నుంచే రామ్ అంటే తనకు చాలా ఇష్టమని వెల్లడించింది. ముఖ్యంగా ఆయన ఉత్సాహభరితమైన నటన, తెరపై కనిపించే స్టైల్, డ్యాన్స్, ఎనర్జీ తనను బాగా ఆకట్టుకుంటాయని చెప్పింది. ఒక రకంగా రామ్ తనకు “క్రష్” అని కూడా ఎలాంటి సంకోచం లేకుండా స్పష్టంగా చెప్పడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. రామ్ నటించిన సినిమాలను తాను తప్పకుండా చూస్తానని, ఆయన తెరపై కనిపించే తీరు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుందని తెలిపింది. “రామ్ గారి సినిమాల్లో ఉండే ఎనర్జీ నాకు చాలా ఇష్టం. ఆయనతో కలిసి ఒక సినిమాలో నటించే అవకాశం వస్తే అస్సలు వదులుకోను” అని వైష్ణవి చెప్పిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సాధారణంగా హీరోయిన్లు వ్యక్తిగత అభిరుచులు లేదా తమ అభిమాన హీరోల గురించి బహిరంగంగా చెప్పడానికి కొంత వెనుకంజ వేస్తుంటారు. అయితే వైష్ణవి మాత్రం ఎంతో సరళంగా, నిజాయితీగా తన అభిప్రాయాన్ని వెల్లడించడం అభిమానులను ఆకట్టుకుంది. ఆమె వ్యాఖ్యలపై రామ్ అభిమానులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. “రామ్ వైష్ణవి కాంబినేషన్‌లో సినిమా వస్తే బ్లాక్‌బస్టర్ ఖాయం”, “ఇద్దరి ఎనర్జీ స్క్రీన్‌పై అదిరిపోతుంది”, “ఈ జోడీని దర్శకులు వెంటనే తీసుకోవాలి” అంటూ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేస్తున్నారు. కొందరు అభిమానులు ఇప్పటికే వీరిద్దరి ఫోటోలను ఎడిట్ చేసి పోస్టర్లు కూడా రూపొందిస్తున్నారు. ఇక ‘బేబి’ సినిమా విజయంతో వైష్ణవి చైతన్య కెరీర్ పూర్తిగా మారిపోయింది. యువతను బాగా ఆకట్టుకున్న ఈ చిత్రంలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా లభించాయి. మధ్యతరగతి యువతి పాత్రలో ఆమె చూపించిన భావోద్వేగ నటన సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ఈ సినిమా తర్వాత వైష్ణవికి వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆమె ఆనంద్ దేవరకొండతో మరో సినిమాలో నటిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సహజమైన నటన, సింపుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులకు దగ్గరైన వైష్ణవి, రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో పెరిగిన వైష్ణవి చైతన్య సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి సినీ రంగంలోకి వచ్చారు. సినిమాల్లోకి రాకముందు యూట్యూబ్ షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు సంపాదించారు. ముఖ్యంగా

‘సాఫ్ట్‌వేర్ డెవలపర్’ వెబ్ సిరీస్ ఆమెకు యువతలో విపరీతమైన క్రేజ్ తీసుకొచ్చింది. ఆ వెబ్ సిరీస్ కారణంగా చాలామంది ఆమెను “సాఫ్ట్‌వేర్ డెవలపర్ వైష్ణవి” అని పిలిచేవారు. వెబ్ సిరీస్‌లలో మంచి గుర్తింపు వచ్చిన తర్వాత ఆమెకు సినిమాల్లో చిన్న పాత్రలు చేసే అవకాశాలు వచ్చాయి. అల్లు అర్జున్ నటించిన అల వైకుంఠపురములో వంటి చిత్రాల్లో



చిన్న పాత్రల్లో కనిపించిన వైష్ణవి, ఆ తర్వాత బేబి సినిమాతో హీరోయిన్‌గా సంచలన విజయాన్ని అందుకుంది. ‘బేబి’ విడుదల తర్వాత ఆమెకు అభిమానుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా యువతలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. ఇప్పుడు రామ్‌పై తన క్రష్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి ఆమెను వార్తల్లో నిలిపాయి. భవిష్యత్తులో ఈ “క్రష్ కాంబినేషన్” నిజంగా వెండితెరపై కనిపిస్తుందేమో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ‘పెద్ది’ ట్రైలర్‌కు ముంబై వేదిక.. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ ప్రమోషన్స్





వేద న్యూస్ డెస్క్:

టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న పెద్ది చిత్రం ఇప్పుడు మరోసారి సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచిన ఈ సినిమా ట్రైలర్‌ను ముంబైలో గ్రాండ్ ఈవెంట్ ద్వారా విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. మే 18న నిర్వహించనున్న ఈ భారీ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీ మార్కెట్‌పై కూడా బలమైన దృష్టి పెట్టిన చిత్ర యూనిట్, ట్రైలర్ లాంచ్‌ను ముంబైలో నిర్వహించడం ద్వారా సినిమాను పాన్ ఇండియా స్థాయిలో మరింత బలంగా నిలబెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దక్షిణాది సినిమాలకు ఉత్తరాదిలో భారీ ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో, బాలీవుడ్ మీడియా మరియు హిందీ ప్రేక్షకులను ఆకర్షించేలా ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని సమాచారం. చిత్ర యూనిట్‌తో పాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. హిందీ మీడియాతో ప్రత్యేక ఇంటరాక్షన్స్, అభిమానులతో ప్రత్యేక కార్యక్రమాలు కూడా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు హీరోను ఎన్నడూ చూడని మాస్ అవతార్‌లో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచింది. గ్రామీణ నేపథ్యంతో కూడిన భావోద్వేగ కథ, భారీ యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ డైలాగ్స్ ఈ చిత్రానికి ప్రధాన బలాలుగా నిలుస్తాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ట్రైలర్‌ను అత్యంత హై వోల్టేజ్ ఎమోషన్స్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో కట్ చేస్తున్నారని సమాచారం. ప్రేక్షకుల్లో సినిమాపై మరింత ఆసక్తి పెంచేలా ట్రైలర్ ఉండబోతుందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు. ఇటీవల దక్షిణాది చిత్రాలు బాలీవుడ్ మార్కెట్‌లో భారీ విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో, ‘పెద్ది’ టీమ్ కూడా అదే దారిలో దూసుకెళ్లాలని భావిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా ముంబైలో ట్రైలర్ విడుదల ద్వారా హిందీ బెల్ట్‌లో ముందుగానే బలమైన బజ్ సృష్టించాలనే వ్యూహంతో మేకర్స్ పనిచేస్తున్నారని అంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో కూడా ‘పెద్ది’పై ఇప్పటికే భారీ చర్చ జరుగుతోంది. ట్రైలర్ విడుదల తర్వాత ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు. పోస్టర్లు, గ్లింప్స్‌తో వచ్చిన స్పందనను చూస్తే ట్రైలర్‌కు కూడా భారీ రెస్పాన్స్ రావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను తీసుకెళ్లాలనే లక్ష్యంతో మేకర్స్ ప్రత్యేక ప్రమోషనల్ ప్లాన్ రూపొందించినట్లు తెలుస్తోంది. తెలుగు, హిందీతో పాటు ఇతర భాషల్లో కూడా భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ముంబై వేదికగా జరగనున్న ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమం ‘పెద్ది’ సినిమాకు దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురానుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# ‘రాకాస’కు ఓటీటీలో భారీ స్పందన

వేద న్యూస్ డెస్క్:




టాలీవుడ్ నుంచి ఇటీవల విడుదలైన హారర్ ఫాంటసీ కామెడీ చిత్రం ‘రాకాస’ ఇప్పుడు ఓటీటీలో సంచలనం సృష్టిస్తోంది. థియేటర్లలో మంచి స్పందన అందుకున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతోంది. తాజాగా విడుదలైన గ్లోబల్ టాప్10 ఆంగ్లేతర చిత్రాల జాబితాలో ‘రాకాస’ ఏడో స్థానాన్ని దక్కించుకుంది. ఏప్రిల్ 27 నుంచి మే 3 వరకు గల వారానికి సంబంధించిన వీక్షణ గణాంకాలను విడుదల చేయగా, ఈ చిత్రానికి 12 లక్షల వ్యూస్ వచ్చినట్లు వెల్లడైంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వీక్షించిన ఆంగ్లేతర చిత్రాల్లో ‘రాకాస’ ఒకటిగా నిలిచింది. ముఖ్యంగా తెలుగు హారర్ కామెడీ చిత్రాలకు విదేశీ ప్రేక్షకుల నుంచి కూడా ఆదరణ పెరుగుతోందని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. యువ నటుడు సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా కనిపించారు. దర్శకురాలు మానస శర్మ హారర్, ఫాంటసీ, కామెడీ అంశాలను మేళవిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మొదట థియేటర్లలో సాధారణ స్థాయిలో ప్రారంభమైన ఈ సినిమా, పాజిటివ్ మౌత్ టాక్‌తో క్రమంగా మంచి వసూళ్లు సాధించింది. ఓటీటీలో విడుదలైన తర్వాత మరింత పెద్ద స్థాయిలో స్పందన రావడం విశేషంగా మారింది. ప్రత్యేకంగా కుటుంబ ప్రేక్షకులు, యువత ఈ సినిమాను ఎక్కువగా వీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల్లో సినిమాకు సంబంధించిన కామెడీ సన్నివేశాలు, మీమ్స్ వైరల్ అవుతూ ఉండటం కూడా చిత్రానికి అదనపు బలంగా మారింది. భారీ బడ్జెట్ లేదా స్టార్ హీరోలు లేకుండానే మంచి కథ, వినోదం ఉంటే ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకోవచ్చని ‘రాకాస’ మరోసారి నిరూపించిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థల సహకారంతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో అత్యధికంగా వీక్షిస్తున్న తెలుగు సినిమాల్లో ఒకటిగా కొనసాగుతోంది.

# పెళ్లిపై ఫరియా ఆసక్తికర వ్యాఖ్యలు



వేద న్యూస్ డెస్క్:

‘జాతిరత్నాలు’ సినిమాలో చిట్టి పాత్రతో ప్రేక్షకుల మనసులు దోచుకున్న ఫరియా అబ్దుల్లా తాజాగా ప్రేమ, పెళ్లి, జీవితంపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచింది. తన చలాకీతనం, కామెడీ టైమింగ్‌తో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ నటి, పెళ్లిపై భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేసింది. తన దృష్టిలో ప్రేమ, వివాహం రెండూ పూర్తిగా వేర్వేరు అంశాలని ఫరియా తెలిపింది. “మనల్ని ఎవరైనా ప్రేమిస్తున్నారనే భావన ఎంతో అందమైనది. జీవితంలో ఒక తోడు ఉండటం కూడా అవసరమే. కానీ పెళ్లి అనేది మనిషిని పూర్తిగా మార్చే బంధం” అని ఆమె పేర్కొంది. ప్రస్తుత తరం యువత వివాహం కంటే వ్యక్తిగత స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఫరియా అభిప్రాయపడింది. రాబోయే రోజుల్లో పెళ్లి అనే భావనకు కొత్త అర్థం వచ్చే అవకాశముందని ఆమె వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఆమె మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇక తన వ్యక్తిగత జీవితంపై కూడా ఫరియా ఆసక్తికర విషయాలు వెల్లడించింది. తాను హీరోయిన్ కాలేదంటే పెద్ద క్రూయిజ్ షిప్‌లో చెఫ్‌గా పనిచేసేదాన్నని లేదా ఈవెంట్ మేనేజర్‌గా కెరీర్ కొనసాగించేదాన్నని తెలిపింది. ప్రయాణాలు అంటే తనకు ఎంతో ఇష్టమని, ట్రావెల్ వ్లాగర్‌గా కూడా మారే అవకాశముందని చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఫరియా అబ్దుల్లా కేవలం నటి మాత్రమే కాదు, మంచి నర్తకి, రచయిత్రి కూడా. మాస్ కమ్యూనికేషన్ చదువుతున్న సమయంలో దర్శకుడు నాగ్ అశ్విన్ ఆమె ప్రతిభను గుర్తించగా, ఆ తర్వాత ‘జాతిరత్నాలు’ ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే రూమర్లను పెద్దగా పట్టించుకోనని, మంచి కథలు, బలమైన పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని ఫరియా స్పష్టం చేసింది. పాత్ర చిన్నదైనా ప్రాధాన్యం ఉంటే నటించేందుకు సిద్ధమేనని తెలిపింది

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073